క్లుప్తంగా

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి


పుల్లమ్మ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు తమ్మనబోయిన పుల్లమ్మ (95) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ షరీఫుద్దిన్, ఉప సర్పంచ్ పేర్ల లింగయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లకు చెందిన పంతం వెంకన్న ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు ఆయన స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10,500 నగదు, బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు చురుకంటి చంద్రారెడ్డి, భయ్యా రవి, ఉయ్యాల ప్రసాద్, సైరెడ్డి సరోజ, పంతం వెంకన్న, భూరెడ్డి సంజీవరెడ్డి, యాస పుల్లారెడ్డి, తొట్ల నిర్మల, కొత్తపల్లి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

నాగారం : ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో వరి నాట్లు వేసుకోవడానికి నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు నాట్లు వేసుకుంటున్నారని, ప్రభుత్వం ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని కోరారు. ఆయనతో పాటు సీఐటీయూ నాయకులు గుడిపూడి వెంకటేశ్వర్లు, తంగెళ్ల వెంకన్న, రాములు, మల్లయ్య, సైదులు, వీరన్న ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు


కాసర్లపహాడ్‌లో పీర్ల ఊరేగింపు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్, కొమ్మాల, కోడూరు, కుంచమర్తి, ఉయ్యాలవాడ, బొల్లంపల్లి, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో పీర్ల ఊరేగింపును ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ పేర్లతో పిలువబడే పీర్లను హిందువులు, ముస్లింలు కలిసి ఊరేగించారు.

పెన్షన్ పెంపు కేసీఆర్ పాలనా దక్షతకు నిదర్శనం

ఆత్మకూరు(ఎస్): దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్ రూ. 4016లకు పెంచడం సీఎం కేసీఆర్ పరిపాలనా దక్షతకు నిదర్శనమని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణ గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్

మోతె : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతులు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలు మూడు పంటలు పండించి ఆర్థిక భరోసా కలిగి ఉన్నారన్నారు. కేసీఆర్ పాలన దక్షతతో వ్యవసాయ రంగం గొప్పగా అభివృద్ధి చెందిందన్నారు. రైతులకు ఉచితంగా 24గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రైతులను వ్యతిరేకించే కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్లు కొండపల్లి వెంకటరెడ్డి, ముప్పాని శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పానుగోటి నర్సింహారావు, ఆరె లింగారెడ్డి, మద్ది మధుసూదన్‌రెడ్డి, ఎస్‌కే జానిపాష, నవిల రామకోటయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా లింకు రోడ్లు

- ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లపై అడుగడుగునా గుంతలు
- వానొస్తే దారులన్నీ చిత్తడిగా మారుతుండడంతో తప్పని ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని రైతులు, ఆయా గ్రామాల ప్రజల వేడుకోలు


బురదమయంగా ఉన్న తుమ్మలపెన్‌పహాడ్ - సిరికొండ దారి


గుంతలతో అధ్వానంగా ఉన్న ఆత్మకూరు - నంద్యాలవారిగూడెం రోడ్డు

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా అధ్వానంగా మారిన లింకు రహదారులతో జనం అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ బావులు, ఇతర మండలాలు, గ్రామాలకు చాలా దగ్గర దారులుగా ఉన్నటువంటి ఈ రహదారులు చినుకు పడితే చిత్తడిగా మారిపోతున్నాయి. దశాబ్దాలుగా ఈ రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో జనం అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా ఆత్మకూరు మండల కేంద్రం నుంచి దాదాపు పది గ్రామాలు, తండాలకు లింకు దారులు ఉన్నాయి. ఇందులో ఐదారు గ్రామాలకు రహదారులు బాగానే ఉన్నప్పటికీ ఇతర గ్రామాలకు డొంకదారులే దిక్కుగా మారాయి. ఆత్మకూరు నుంచి నంద్యాలవారిగూడెం, ఇస్తాళపురం, పుప్పాలగూడెం గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు డొంకదారులనే ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల తుమ్మల పెన్‌పహాడ్, గుడితండాకు బీటీ రోడ్డు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. నంద్యాలవారిగూడెం, పుప్పాలగూడెం, ఇస్తాళపురం గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యవసాయ పనుల నిమిత్తం ఈ దారుల్లో వెళ్లే రైతులు వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నారు. ఈ మట్టి దారులపై ఏర్పడిన గుంతలను సైతం పూడ్చడంలేదు. వర్షాకాలంలో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, మోటార్ సైకిళ్లు తిరిగి మోకాళ్ల లోతు గుంతలు పడుతున్నాయి. బురదమయంగా ఉండడంతో ఈ దారుల్లో నడిచేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నడుస్తూ.. బైక్‌లపై వెళ్తూ జారిపడుతున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండాపోవడంతో కూలీలు వ్యవసాయ పనులకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని రైతులు వాపోతున్నారు. ఇక మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ నుంచి మోతె మండలం సిరికొండ గ్రామానికి ఉన్నటువంటి రహదారి చాలాకాలంగా మరమ్మతులకు నోచుకోక చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ప్రస్తుతం వారం రోజులుగా ముసురు ఉంటుండడంతో ఆయా లింకు రహదారుల్లో రైతులు కనీసం నడిచివెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి లింకు దారులను బీటీ రోడ్లుగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బురదగా మారుతోంది

వానాకాలం వచ్చిందంటే వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. అడుగుకో గుంత పడి దారులు అధ్వానంగా మారాయి. వర్షాలకు చిత్తడిగా మారి కనీసం నడవలేని పరిస్థితి ఉంది. ఈ దారులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. కనీసం మొరం కూడా పోయించడం లేదు.



– పొట్టపెంజర గంగయ్య

మరమ్మతులు చేయాలి

తుమ్మలపెన్‌పహాడ్ నుంచి సిరికొండ వెళ్లే దారి బురదమయంగా ఉంది. చాలాకాలంగా కనీసం మొరం పోసిన దాఖలాలు లేవు. వ్యవసాయ బావుల దగ్గరికి పశువులను తోలుకుని పోయే అవకాశం లేదు. ఓవైపు గుంతలు.. మరోవైపు కంపచెట్లు పెరిగి ఇబ్బందిగా మారింది. రహదారికి మరమ్మతులు చేయాలి.



– వెంకన్న, తుమ్మలపెన్‌పహాడ్

విజేతలకు బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

పెన్‌పహాడ్ : నారాయణగూడెంలో ఇటీవల నిర్వహించిన జీజేఆర్ కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్ మండలి మల్లయ్యలు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తారకమ్మ, మామిడి నాగయ్య, జానకిరాములు, శ్రీను, రాములు, సైదిరెడ్డి, సతీష్‌రెడ్డి, నిమ్మల ప్రవీణ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

అర్వపల్లి : మణిపూర్ ఘటనలకు బాధ్యత వహిస్తూ అక్కడి ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ ప్రత్యేక ఇన్‌చార్జ్ దయాకరన్‌మౌర్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అర్వపల్లిలో బీఎస్పీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొడ్డు కిరణ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు న్యాయవాది దందోలు తిరుపతి, జిల్లా అధ్యక్షుడు బుడిగె మల్లేష్‌యాదవ్, జిల్లా ఈసీ మెంబర్ దాసరి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెపాక వెంకటేష్, కమటం శోభాబాయ్, మండల అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి శతకోటి కోటేశ్వర్లు, జీడి వెంకన్న పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి..

మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనకు కారకులను కఠినంగా శిక్షించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో పీవైఎల్ జిల్లా నాయకుడు వేముల గణేష్, గోవర్ధన్, రమేష్, సతీష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మణిపూర్ దుర్ఘటన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కొలిశెట్టి యాదగిరి, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, కడియం కుమార్, గద్దం ఎల్లయ్య, కృష్ణమూర్తి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, యాదగిరి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తడకమళ్ల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లిలో నిరసన ర్యాలీలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు


తుంగతుర్తిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

జగదీష్‌రెడ్డి మళ్లీ గెలవాలని పూజలు


గంగదేవమ్మ వద్ద పూజలు చేస్తున్న నాయకులు

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అని రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ కక్కిరేణి నాగయ్య గౌడ్, కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రానున్న ఎన్నికల్లో సూర్యాపేట ఎమ్మెల్యేగా మంత్రి జగదీష్‌రెడ్డి మూడోసారి విజయం సాధించాలని ఆదివారం టేకుమట్ల గ్రామంలోని గంగదేవమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కక్కిరేణి ఆనంద్‌గౌడ్, రాపర్తి సైదులుగౌడ్, ఇండ్ల సురేష్, రాపర్తి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే పింఛన్ పెంపు

భానుపురి : వికలాంగుల పెన్షన్ రూ.4016లకు పెంచడం కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం పోరాట ఫలితమేనని, కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే వికలాంగుల సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని పీసీసీ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగ, స్త్రీశిశు సంక్షేమ శాఖలను కలిపి ప్రభుత్వం వికలాంగులకు సంక్షేమం అందకుండా చేసిందన్నారు. చివరకు కాంగ్రెస్ పార్టీ చేసిన ఉద్యమాలతోనే రెండుశాఖల విలీనాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు జిల్లాకో వికలాంగుల స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామన్న సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సెంటర్‌ను మూసివేశారన్నారు. సర్టిఫికెట్ కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో ఏనాడూ వికలాంగుల దినోత్సవంలో పాల్గొనని కేసీఆర్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, నాగుల వాసు, జానయ్య, శేఖర్, మాణిక్యం, వల్దాసు శ్రీను, వెంకట్‌రెడ్డి, నరేందర్‌నాయుడు, గౌస్‌ఖాన్, పిడమర్తి రాజు, అబ్బాస్, బంటి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.


భానుపురి : మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

వీహెచ్‌పీఎస్ పోరాట ఫలితమే పింఛన్ల పెంపు

ఆత్మకూరు (ఎస్) : వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గత రెండు నెలల కాలంలో మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే వికలాంగుల పెన్షన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.3016 నుంచి రూ.4016లకు పెంచిందని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్ బాబా తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగులకు స్వతంత్ర శాఖ, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ఓ హెచ్ రోస్టర్ మార్పు, అంత్యోదయ కార్డులు, గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం రిజర్వేషన్, వికలాంగుల బంధు తదితర డిమాండ్ల సాధన కోసం మరిన్ని ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

డ్రమ్‌సీడర్‌కే రైతుల మొగ్గు

- నాగారం మండలంలో 19వేల ఎకరాల్లో వరి సాగు అంచనా
- 70 శాతం మంది రైతులు డ్రమ్‌సీడర్‌కే ఆసక్తి
- తక్కువ ఖర్చుతో వరిసాగు


పసునూర్ గ్రామంలో డ్రమ్‌సీడర్‌తో వరివిత్తనాలు వేస్తున్న రైతులు

నాగారం : వరిసాగులో కూలీల కొరతను అధిగమించడం, నాట్ల ఖర్చును తగ్గించుకోవడానికి ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు డ్రమ్‌సీడర్ పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. గత నాలుగేళ్లుగా వెదజల్లే, డ్రమ్‌సీడర్ విధానంతో సాగు చేసిన పంట పొలాలు మంచి దిగుబడిని అందిస్తుండటంతో రైతులు ఈ పద్ధతులను అనుసరిస్తున్నారు. కొంత మంది రైతులు మాత్రమే నారును సిద్ధం చేసుకుంటున్నారు.

కూలీల కొరతను అధిగమించేందుకు..

మండలంలో రైతులంతా ఒకేసారి నాట్లు వేస్తుండటంతో కూలీల కొరత కూడా పెరుగుతుంది. ఒక్కోసారి కూలీల కోసం వారం, పది రోజుల పాటు వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కూలీలు సమయానికి రాకపోవడంతో 25 రోజులకు నాటు పెట్టాల్సిన పొలాలు నెలన్నరకుపైగా వాయిదా పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. సమయానికి నాటు వేయకపోవడంతో పంట దిగుబడి తగ్గి సగం పంట కూడా చేతికి రాని పరిస్థితులు ఉండేవి. కూలీలు వస్తారని దమ్ము చేసిన పొలాలు ఆ కూలీలు ఆలస్యంగా రావడంతో మళ్లీ దమ్ము చేయాల్సి రావడంతో ఖర్చులు పెరిగేవని రైతులు పేర్కొంటున్నారు. అదే డ్రమ్ సీడర్ విధానంలో అయితే ఏకరాకు దాదాపు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. పైగా దిగుబడి ఎక్కువగా వస్తోంది. పంట 15 నుంచి 20 రోజుల ముందే చేతికొస్తుండటం, కూలీల ఖర్చు తగ్గుతుండటం తదితర కారణాల వల్ల రైతులు ఈ పద్ధతికే ఆసక్తి చూపుతున్నారు.

19వేల ఎకరాల్లో వరిసాగు అంచనా..

మండలంలో గత వానాకాలంలో దాదాపు 17 వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఈ వానాకాలంలో సుమారు 19వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే మండలంలో ఇప్పటికే వరినాట్లు ప్రారంభమయ్యాయి.

డ్రమ్‌సీడర్ పద్ధతితో అధిక లాభాలు

నాటు వేసే పద్ధతి కంటే వెదజల్లుడు, డ్రమ్‌సీడర్ పద్ధతితో అధిక లాభాలు పొందవచ్చు. కలుపును నియంత్రించుకుంటే పంట దిగుబడి పెరుగుతుంది. డ్రమ్‌సీడర్‌తో కూలీల ఖర్చు తగ్గి, దిగుబడి కూడా పెరుగుతుంది. మండలంలో 60 నుంచి 70 శాతం మంది రైతులు డ్రమ్‌సీడర్‌కే ఆసక్తి చూపుతున్నారు.

– పెండోట గణేష్, ఏఓ, నాగారం

ఖర్చు తగ్గుతుంది



డ్రమ్ సీడర్ పద్ధతితో కూలీల ఖర్చు తగ్గుతుంది. నాకున్న 7 ఎకరాల్లో డ్రమ్‌సీడర్ పద్ధతి ద్వారా వరిసాగు చేస్తున్నాను. గతంలో కూలీలతో నాట్లు వేయిస్తే ఎకరాకు రూ.6వేలు ఖర్చు అయ్యేది, డ్రమ్‌సీడర్‌తో రూ. 2 నుంచి రూ.3వేలతో నాటు పూర్తవుతుంది. దిగుబడి కూడా ఎకరాకు 3 నుంచి 4 బస్తాలు అధికంగా వస్తుంది.

– వేర్పుల శ్రీనివాస్, రైతు, పసునూర్

అయ్యప్ప భక్తుల సన్నిధానానికి స్థలం వితరణ


అయ్యప్ప భక్తులతో మేడే రాజీవ్‌సాగర్

తుంగతుర్తి : వెలుగుపల్లిలో అయ్యప్ప స్వామి భక్తుల సన్నిధానానికి తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆదివారం రూ.2లక్షల విలువగల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు గుండా శ్రీనివాస్, చుంచు శ్రీధర్, కొరబోయిన వెంకటనారాయణ, సరాల సురేష్, మైసా పరశురాములు, జాగృతి నాయకులు గొడుగు మహేందర్, సోలిపురం ఉపేందర్‌రెడ్డి, తూము యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డె జానమ్మ మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : భక్తాళాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వడ్డే జానమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు అడివయ్య, మాజీ జెడ్పీటీసీ కోటేశ్వర్ రావు, చింతం వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతరావు, వీరభద్రయ్య ఉన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


పెన్‌పహాడ్ : సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు


నూతనకల్ : ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు


అర్వపల్లిలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

చివ్వెంల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్, భిక్షం, రాంబాబు, క్రిష్ణ, ఈదయ్య, గోపాల్, ఉప్పలయ్య, మోహన్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరితాళ్లతో కార్మికుల నిరసన

నూతనకల్ : సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఆదివారం ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు నకిరేకంటి శంభయ్య, పెద్దింటి అచ్చిరెడ్డి, రామాచారి, పరశురాములు, ఎల్లయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల భిక్షాటన

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు అర్వపల్లిలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 18వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం తమ సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధనియాకుల శ్రీనివాస్, రణపంగ వెంకన్న, నకిరేకంటి నర్సయ్య, ఎల్లమ్మ, రమణయ్య, వెంకన్న, వెంకటమ్మ, దూదియా పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. క్షేత్రాన్ని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి–మాజీ జెడ్పీటీసీ లావణ్య దంపతులు, ఎన్నారై పటేల్ శ్రీధర్‌రెడ్డి–పద్మావతి దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి

మండల కమిటీ ఎన్నిక


వీరన్నగౌడ్

మద్దిరాల : గౌడ జనహక్కుల పోరాట సమితి మండల నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చౌగాని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జి. కొత్తపల్లి గ్రామానికి చెందిన కన్న వీరన్నగౌడ్, ఉపాధ్యక్షుడిగా మోడెం వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బిక్కి బుచ్చయ్య, తొన్కునూరి అశోక్, నర్సయ్య, రేసు రాములు, కన్న నాగన్న, రేసు వెంకన్న, గుండ్ల నాగేందర్, గునగంటి సంతోష్, మల్లయ్య, వెంకన్న, రేసు జగదీష్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ రద్దు


మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

భానుపురి : సూర్యాపేటలోని శబరినగర్ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీని రద్దు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం ఐదుగురు సభ్యుల కమిటీ తెలిపింది. కరోనా కాలంలో ఆడిట్ జరగలేదని, ప్రస్తుతం 2017–18 సంవత్సరానికి చెందిన రశీదు పుస్తకాలు, జమ ఖర్చులు లెక్కించామన్నారు. ఇందులో రూ.5లక్షలు తేడా ఉన్నట్లు గమనించామని తెలిపారు. ఈ డబ్బును ఆలయ ఆర్థిక వ్యవహారాలు చూసిన ప్రధాన కార్యదర్శి పగిడిమర్రి కేశవులు చెల్లించాలని తీర్మానం చేశామన్నారు. ప్రస్తుత ఆలయ కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఆగస్టు 13వ తేదీన ఎన్నుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుత కమిటీలోని వారంతా రెండేళ్ల పాటు పోటీ చేయడానికి వీలు లేదన్నారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద పలువురు భక్తులు ఆందోళన చేశారు. చాలాకాలంగా ఆలయంలో పనిచేస్తున్నామని, తమకు నూతనంగా సభ్యత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కారణంగా పోలీసుల బందోబస్తు నడుమ ఆలయ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాస సత్యానారాయణరెడ్డి, ఎండీ ఇస్మాయిల్, క్లెం శంభారెడ్డి, చిప్పెలపెల్లి రవి, మూరగుండ్ల సైదులు, గంట మల్సూర్, పురం శ్రీనివాస్, నవిలె యశోద, చిలకర పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ జన్మదిన వేడుకలు

నాగారం : నాగారం మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి జన్మదినం సందర్భంగా నాగారం ఎక్స్‌రోడ్డులో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.